ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 19 జూలై 2025



వెజిటబుల్స్



- శ్రావణం ముందే కూరలు కుతకుత..
- జిల్లాలో తగ్గుతున్న కూరగాయల సాగు
- 20 రోజుల్లోనే 30 శాతానికి పైగా పెరిగిన ధరలు
- సామాన్యులకు తప్పని ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శుభముహూర్తాల మాసంగా ఉండే శ్రావణంలో సహజంగానే కూరగాయల వినియోగం పెరుగుతుంది. ధరలు కూడా కొంచం ఎక్కువగానే ఉంటాయి. ఇదే క్రమంలో ఉత్పత్తి కూడా తగ్గి కూరగాయలపై ధరల ప్రభావం చూపుతుంది. ఈసారి ఆషాఢంలోనే కూరల ధరలు కుతకుతగా ఉడుకుతున్నాయి. దాదాపు 20 రోజులుగా రోజురోజుకు కూరగాయల ధరలు పెరుగుతున్న తీరు సామాన్య ప్రజలకు ఇబ్బందిగా మారింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కూరగాయల సాగు గతంలో బాగా ఉండేది. జిల్లాలో సాగునీరు సమృద్ధిగా లభిస్తున్న నేపథ్యంలో జిల్లా రైతులు వరి, పత్తి ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో కూరగాయల సాగు తగ్గింది. జిల్లాలో వానకాలం సీజన్లో 2.43 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుకు సిద్ధం కాగా, వరి 1.83 లక్షల ఎకరాలు, పత్తి 49 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు తక్కువగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల పైనే జిల్లా ప్రజలు ఆధారపడాల్సి వస్తోంది. పొరుగు రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో గడిచిన 20 రోజుల్లోనే 25 నుంచి 30 శాతం వరకు ధరలు పెరిగాయి. మరికొన్ని కూరగాయలు 50 శాతం దాటాయి. చికెన్ ధరలు కూడా తగ్గడం లేదు. ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ 80 నుంచి రూ 120 వరకు ధర పలుకుతోంది. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు పప్పుదినుసులతోనే సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి బోయిన్‌పల్లి, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, మండలాలతో పాటు సిద్దిపేట, జిల్లాల నుంచి కూరగాయలు అమ్మకానికి రైతులు తీసుకవస్తారు. కూరగాయల ఉత్పత్తి పడిపోవడంతో దిగుమతులు తగ్గిపోయాయిని వ్యాపారులు తెలిపారు.

సెంచరీ దాటిన మిర్చి..

ఇంట్లో ఏ అల్పాహారం చేసినా, ఏ విధమైన కూరగాయలు వండినా అన్నిట్లో కావాల్సింది పచ్చిమిర్చి. విటమిన్లు, ఖనిజాలు యాంటీ ఆక్సిడెంట్లులతో కూడినమిర్చి సామాన్య ప్రజలకు ఘటిక్కిస్తోంది. వర్షాభావ పరిస్థితులవల్ల ప్రస్తుతం మిర్చి ధర కిలో రూ 100 నుంచి 120 వరకు ధర పలుకుతోంది. 20రోజుల క్రితం కిలోమిర్చి రూ40 నుంచి రూ 60వరకు ధర ఉంది. జిల్లాకు పచ్చిమిర్చి ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి వస్తోంది. ఇతర రాష్ట్రాల్లో భారీవర్షాలతో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లడం ముందుగానే ధరలు పెరిగాయి.

వ్యాపారులకు ఇబ్బంది..

కూరగాయల ధరలు పెరగడంతో సిరిసిల్ల మార్కెట్‌లో వ్యాపారాలు తగ్గిపోయి చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. హోల్‌సేల్ వ్యాపారుల వద్ద కూరగాయలు కొనుగోలు..

- మిగతా 8లో

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది..

- సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్



వేములవాడ కోర్టులో అన్నదానం చేస్తున్న న్యాయవాదులు

వేములవాడ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని సీనియర్ సివిల్‌జడ్జి అజయ్‌కుమార్ జాదవ్ అన్నారు. వేములవాడ కోర్టు ఆవరణలో ఆషాఢ మాసం సందర్భంగా రెండవ శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి అజయ్‌కుమార్ జాదవ్ మాట్లాడుతూ కక్షిదారులకు అన్నదానం మహాదానమని అన్నారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో అన్నదాత, సీనియ న్యాయవాది శ్రీనివాస్ భోజన ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది గణేష్, బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాక్షులు కట్కం జనార్ధన్, ఏజీపి బొడ్డు ప్రశాంత్, గుడిసే సదానందంతో పాటు పలువురు న్యాయవాదులు ఉన్నారు.

సెరికల్చర్ అభివృద్ధిపై రైతులకు అవగాహన



సెరికల్చర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చందుర్తి జూలై 18 (ఆంధ్రజ్యోతి): మేరా రేషమ్ మేరా అభియాన్ 2025 కార్యక్రమం కింద తెలంగాణలో సెరికల్చర్ కార్యకలాపాల విస్తరణలో భాగంగా సెంట్రల్ సిల్క్ బోర్డు, భారత ప్రభుత్వం, టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖాధికారులు, శాస్త్రవేత్తలు బేస్‌లైన్ సర్వే చేశారని జిల్లా సెరికల్చర్ అధికారి జగన్‌రావు తెలిపారు. చందుర్తి మండలం కిష్టంపేట, జోగాపూర్, మల్యాల, లింగంపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. సెరికల్చర్ రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్బీ-సీఎస్ఆర్టీఐ జిల్లా నోడల్ అధికారి, శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లికార్జున్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన పట్టాలను తిరిగివ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రద్దు చేసిన పోడు భూముల పట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి రైతులకు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా వేములవాడ, భూడిదికుంట, నాంపెల్లి పల్లగుట్ట, మర్రిపెల్లి, ఇల్లంతకుంట ప్రాంతాలో రైతులకు సాగు చేసుకోవడానికి పోడు భూముల పట్టాలను ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ భూమి పట్టాలను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి రైతులకు ఇచ్చిన ప్రభుత్వ పోడు భూముల పట్టాలను తిరిగి ఇవ్వాలన్నారు. జిల్లాలోని మరిమడ్ల కొండంచర్లలో దాదాపు 80 ఎకరాల పోడు భూములు ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అక్కడ సాగు చేసుకోవడానికి పట్టాలను ఇవ్వాలన్నారు. అదే విధంగా రైతులకు సకాలంలో ఎరువులు, క్రిమిసంహారకాలు సబ్సిడీపై రైతులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్



గురుకులంలో వంట సామగ్రిని పరిశీలిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గురుకులాల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూరొశివారు ఇప్పల్లపల్లె ఎక్స్‌రోడ్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. గురుకులంలో విద్యార్థుల కోసం తయారుచేసే వంటలతోపాటు వంట సామగ్రి, భోజన, తరగతి గదులను సందర్శించి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంపై అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారన్నారు. ఇప్పటికైనా గురుకులాల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి గుండెల్లి వేణుగోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంచర్ల పర్శరాములు, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య భవనాల కూల్చివేతలు

- పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



కూల్చివేతలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

7

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ఎస్పీ మహేష్ బి. గీతే



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ మహేష్ బీ. గీతే

8

'ఇందిరా మహిళా శక్తి'తో ఆర్థిక ప్రగతి

- డీఆర్డీవో శేషాద్రి



మహిళలకు చెక్‌ను అందిస్తున్న డీఆర్డీవో, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు

సిరిసిల్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నారని డీఆర్డీవో శేషాద్రి తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల జిల్లాకేంద్రంలో కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు, వ్యాపారాల నిర్వహణ, స్కూల్ యూనిఫాంలు తదితర రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళా సంఘాల సభ్యులను సన్మానించారు. పలు సంఘాలకు రుణాలు, ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక ప్రగతి కోసం ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలుచేస్తుందని వివరించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలుకేంద్రాలు, పెరటికోళ్ల పెంపకం, డెయిరీ యూనిట్, పిండి గిర్నీ, మూడు సీహెచ్‌సీలు, స్కూల్ యూనిఫామ్ ఇతర స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా భరోసా అందిస్తుందని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం సేకరించడం ద్వారా రూ1.06కోట్లు కమిషన్ వచ్చిందని తెలిపారు. 46037మంది విద్యార్థులకు స్కూలు యూనిఫామ్‌లు కుట్టిస్తే రూ.48లక్షల చార్జీలు చెల్లించామని తెలిపారు. నియోజకవర్గంలోని 4250 సంఘాలు రుణాలు సకాలంలో చెల్లించడంతో రూ 5.90కోట్ల వడ్డీ ప్రభుత్వం తిరిగి చెల్లించిందని అన్నారు. రుణాలు చెల్లించడంలో జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య ఉత్తమ సేవలతో జాతీయ పథకానికి ఎంపిక అయిందని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు స్వరూపారెడ్డి, సబేరా బేగం, కొమిరిశెట్టి విజయ, రాణిలు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని అన్నారు. ఉచిత బస్సు, విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నదని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కింద అందిస్తున్న ఆర్థికసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాము ఉపాధి పొందుతూ మిగతా వారికి పని కల్పించే స్థాయికి ఎదుగుతున్నారని వివరించారు. ప్రభుత్వం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం మహిళా సంఘాలకు దాదాపు 23 ఎరువుల దుకాణాలు, పలు పెట్రోల్ బంక్‌లు ఇతర స్వయం ఉపాధి యూనిట్లు అందిస్తున్నారని తెలిపారు. పలు మండలాల్లో త్వరలో సోలార్ ప్లాంట్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, అడిషనల్ డీఆర్డీవో సీహెచ్ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

- నేతన్న చౌక్ వద్ద బీఆర్ఎస్ ధర్నా



నేతన్న చౌక్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తరచూ గురుకులాల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నారంటూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం జిల్లాకేంద్రంలోని నేతన్న చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలలో దాదాపు 90మంది గురుకులాల విద్యార్థులు చనిపోయారని, దాదాపు 1000 మంది ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రుల పాలైనారని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనన పథకంలో విషహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురి అవుతున్న సంఘటనలు నెలకొనడం విచారకరమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వంను నమ్మి పిల్లలను గురుకులాలకు పంపిస్తే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరే విద్యాశాఖ పెట్టుకొని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని ఫుడ్ పాయిజన్ సంఘటనలు వరసగా జరుగుతున్నా ముఖ్యమంత్రి సమీక్ష చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. జగిత్యాల జిల్లా మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో కూడా విషాహారం తిని దాదాపు 30 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, వారికి ప్రభుత్వం మెరుగైన వైద్య చేయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి గురుకులాలు, సాంఘీక సంక్షేమ పాఠశాలలపైన అధికారులతో సమీక్ష జరిపి ఫుడ్ పాయిజన్ పునావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ సంఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మట్టె శ్రీనివాస్, వడ్లూరి సాయిసూర్య, ముద్ద అనిల్‌గౌడ్, ఎస్కే అఫ్రోజ్, రాకేష్, రాజు, నరేష్, బాలు, వెంకటేశం, శ్రీనివాస్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బీసీల రిజర్వేషన్లు..

- జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బీసీల 42శాతం రిజర్వేషన్లను సీఎం కల్పించారని, దీన్ని కేటీఆర్ సమర్థిస్తున్నారా...? లేదా ప్రజలకు చెప్పాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. స్థానికంగా ఉన్న మాకు ఎన్నికలంటే భయం లేదని, దేనికైనా సంసిద్ధంగా ఉన్నామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఎన్నో అవరోధాలు ఎదురైన దేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి చరిత్రలో నిలిచిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీలకు వెన్నుదండుగా నిలుస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా బీసీ రిజర్వేషన్లు 33శాతం ఉంటే 23 శాతంకు కుదించి బీసీల మనోభావాలను దెబ్బతీసిందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంకా తామే అధికారంలో ఉన్నట్లు భ్రమలో ఉన్నారని ఓటమి నుంచి భయట పడతలేరని ఎద్దేవా చేశారు. బీసీల రిజర్వేషన్లపై కేసీఆర్ కుటుంబంలోని వారే విభిన్నమైన స్టేట్‌మెంట్స్ ఇస్తూ గందరగోళంలో ఉన్నారని కేటీఆర్ ముందుగా ఇంటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ కవిత బీసీ రిజర్వేషన్లకు మద్దతునిస్తుందని, ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ బీసీల 42 శాతం రిజర్వేషన్లపై వైఖరేంటో తేటతెల్లన చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, వెంగళ లక్ష్మీనర్సయ్య, ఆడెపు ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నెరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వైద్య శివప్రసాద్, నల్ల శ్రావన్, గాజుల సాగర్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి..

- సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎరుకుల నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ నారాయణ

సిరిసిల్ల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరుగుతాయని, ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్-2) చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ కోరారు. స్థానిక పద్మనాయక ఏసీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సెస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల సబ్‌డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. సీజీఆర్ఎఫ్-2 చైర్‌పర్సన్‌తో పాటు సభ్యులు హాజరుకాగా పలువురు వినియోగదారులు సమస్యలను విన్నవించారు. ఫిర్యాదులపై సెస్ ఎండీ విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరించాలని చైర్‌పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నారాయణ మాట్లాడుతూ సెస్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి సెస్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరి ష్కార వేదిక సభ్యులు సలంద్ర రామకృష్ణ, లకావత్‌కిషన్, మర్రిపల్లి రాజా గౌడ్, సెస్ ఎండీ రామసుబ్బారెడ్డి, ఏవో పయాకర్‌రావు రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన

వీర్నపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నమూనా ఎన్నికలపై అవగాహన కలిగేలా మాక్ పోలింగ్ శుక్రవారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్టీపీసీలో గంజాయి పట్టివేత

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో గురువారం రాత్రి గంజాయిని పట్టుకున్నారు. మేడిపల్లి సెంటరులో వాహనాలు తనిఖీచేస్తున్న క్రమంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆపారు. వాహనంలో తనిఖీ చేయడంతో 100గ్రాముల గంజాయి దొరికింది. పట్టుబడిన ఇద్దరుయువకులు పారిపోయారు. వారిలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొల్లి అజయ్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఇతర నిందితుల కోసం గాలిస్తున్నామని ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. స్కూటీతోపాటు మరో వాహనాన్ని సీజ్‌చేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ నాలాలో పసికందు మృతదేహం

కోల్‌సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్‌కళాశాల సమీపంలోని రాజలక్ష్మికాలనీ వద్ద గల మున్సిపల్ నాలాలో శుక్రవారం పసికందు మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికి తీశారు. కార్పొరేషన్ సిబ్బంది ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం సమయంలో మృతి చెందిన పసికందును మృతదేహాన్ని డ్రైన్‌లో పడవేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈఘటన సప్తగిరి కాలనీ, ఐబీకాలనీ ప్రాంతాల్లో చర్చనీయాంశం అయ్యింది.



జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్లకు ఆర్థిక కష్టాలు

- మూడు నెలలుగా అందని వేతనాలు
- రాష్ట్రంలో 420 మంది ఇంటర్ ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్ల అవస్థలు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలలుగా కాంట్రాక్టు లెక్చరర్లకు వేతనాలు అందకపోవడం వల్ల కష్టాల పాలవుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 420 మంది ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు సకాలంలో వేతనాలు అందక విలవిలలాడుతున్నారు. చాలీచాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు ఏప్రిల్, మే, జూన్ నెలలకు చెందిన జీతాలు రాకపోవడంతో భార్యాపిల్లలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాకపోవడం వల్ల వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇంటర్ బోర్డు పరిధిలో దాదాపు మూడు వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేశారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సు విభాగంలో పనిచేస్తున్న సుమారు 420 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పోస్టులు మంజూరు కాకపోవడం, పలు ఇతర కారణాల వల్ల రెగ్యులర్ కాలేదు. ఒకవైపు ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోవడం, మరోవైపు ఏప్రిల్ నెల నుంచి వేతనాలు అందక పోవడం వల్ల ఆర్థాకలితో అలమటిస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి

నలువాల శ్రీనివాస్, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల



రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే అందించాలి. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వేతనాలు ఏనెలకు ఆనెల సక్రమంగా అందించాలి. వేతనాలకు ఎప్పటికప్పుడు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది.

మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు

కాసం గంగా భవాని, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ లేకపోవడంతో వేతనాలు అందడం లేదంటున్నారు. చాలీ చాలనీ వేతనాలతో సంవత్సరాల తరబడి పనిచేస్తున్నాము. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి.

కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

- ఈ నెల 21న టెక్స్‌టైల్ పార్కు బంద్
- కార్మికుల సమావేశంలో నిర్ణయం



నిరసన తెలుపుతున్న కార్మికులు

తంగళ్లపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు కార్మికులకు నష్టం చేసే విధానాలను ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్‌పార్కు కార్మికుల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిఐటియు జిల్లాకార్యదర్శి రమణ మాట్లడుతూ 2023 సంవత్సరం బతుకమ్మ చీరల జ్లాజ్ పీస్ వస్త్రానికి కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో కార్మికులకు అందించిన మాదిరిగానే మీటర్‌కు 1.42 పైసలు అందించాలన్నారు. నేతన్న పొదుపు పథకం పూర్తయిన డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడంలో నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపట్టారు. కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించక పోవడంతో జులై21న ఒకరోజు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమీక్ష జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సదానందం, వేణు, శ్రీకాంత్, అంజనేయులు, అంబదాస్, వెంకటేశ్, మహేశ్, ఆశోక్, రమేష్ శ్రీనివాస్, కనకయ్య, వరప్రసాద్, గంగారాం. లక్ష్మణ్, రవి, శంకర్, ప్రభాకర్, నరహరి, సత్యనారాయణ, సంపత్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

23న విద్యాసంస్థల బంద్

- విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం జిల్లాలోని తెలంగాణ చౌక్ వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, పిడిఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుతాటి రాణా ప్రతాప్, పిడిఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంగడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాయికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ధర్మాజీపేట శివారులో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన బెక్కం సాయిలు (70) తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

బాలికపై మేనమామ అత్యాచారయత్నం

- తప్పించుకున్న బాలిక
- నిందితుడిపై పోక్సో కేసు

తిమ్మాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై మేనమామ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన సంపంగి ప్రేమ్ కుమార్(30) అనేవ్యక్తి తనసొంత మేనకోడలు అయిన బాలికను ఆమె ఇంటి నుంచి కరీంనగర్‌లోని కళాశాల వద్ద తన ద్విచక్ర వాహనంపై దింపుతానని చెప్పి బలవంతంగా వెంట తీసుకువెళ్లాడు. కానీ కళాశాల వద్ద బాలికను దించకుండా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ శివారులో ఉన్న కాకతీయ కాలువ వైపునకు తీసుకెళ్లాడు. పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి బాలికను బలవంతంగా తీసుకువెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక అతడికి సహకరించకపోవడంతో బండరాయితో హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ప్రతిఘటించిన బాలిక తప్పించుకొని తన తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. తల్లిదండ్రులు బాలికను తీసుకొని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పారు. బాలికను భరోసాకేంద్రానికి తీసుకువెళ్లి మహిళా అధికారి సమక్షంలో స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు సీఐ తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ప్రేమ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు, పోలీసులు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, పట్టుకోవడానికి చర్యలు చేపట్టినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



దేవానందం(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో అనారోగ్యంతో ఈనెల 15న పురుగుల మందు తాగిన రైతు దేవానందం(62) మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ రాహుల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయనకథనం మేరకు.. దేవానందం కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. వ్యవసాయపనులు చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్థాపం చెందిన దేవానందం పురుగుల మందు తాగాడు. మూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య రాజమణి, కొడుకు రాకేశ్‌లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

గుండెపోటుతో డీఎస్పీ మహేష్ మృతి

- కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం



హుజూరాబాద్‌లో భర్త మహేష్ మృతదేహంపై పడి రోదిస్తున్న ఏసీపీ మాధవి, ఇన్‌సెట్లో డీఎస్పీ మహేష్(ఫైల్)



డీఎస్పీ మహేష్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం/ హుజూరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌శిక్షణా కేంద్రంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మహేష్(56) గుండెపోటుతో శుక్రవారం కన్నుమూశారు. ప్రస్తుత హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త అయిన మహేష్ మృతిపట్ల పోలీస్‌శాఖతీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. హుజూరాబాద్‌లో తన భార్య ఏసీపీ మాధవి వద్ద ఉన్న మహేష్ ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ను హుజూరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈఘటనతో ఏసీపీ మాధవితో పాటు కుటుంబసభ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు. ఎస్ఐగా వృత్తిని ప్రారంభించిన మహేష్, సతీమణి మాధవితోకలిసి ఒకేసారి సీఐగా, ఆపై డీఎస్పీగా పదోన్నతులు పొందారు. ఫ్రెండ్లీ పోలీస్ అధికారిగా ఆయనప్రజలమన్ననలు పొందారు.

- డీఎస్పీ మహేష్ పార్థివదేహానికి సీపీ నివాళి..

కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో ఉన్న మహేష్ నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహంపై పూలమాలవేసి సీపీ గౌస్‌ఆలం నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న ఏసీపీ మాధవికి, ఆమె కుమారులకు ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా మహేష్ ఆత్మకుశాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయనతోపాటు అడిషనల్ డీసీపీ(అడ్మిన్) వెంకటరమణ, కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు నివాళులర్పించారు.

పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో పట్టుబడిన, యజమానులు లేని (అన్‌క్లెయిమ్డ్), వదిలివేయబడిన (అబాండన్డ్) మొత్తం140 వివిధరకాల వాహనాలను బహిరంగ వేలంద్వారా విక్రయించనున్నట్లు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాలన్నీ ప్రస్తుతం కరీంనగర్ సీటీసీలో భద్రపరచినట్లు తెలిపారు. సిటీ పోలీస్ చట్టం-1348ఎఫ్, సెక్షన్40 ప్రకారం అందిన అధికారాలతో ఈ వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను వేలం బృందం సభ్యులు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్ సెల్ నంబర్ 8712670758లో సంప్రదించి తెలు సుకోవచ్చన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారిక ఫేస్‌బుక్ పేజీలో కూడా వివరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనాలపై ఏదేని అభ్యంతరం ఉన్నా, లేదా యాజమాన్య/హైపోథికేషన్ హక్కులు ఉన్నా, ఆసక్తిగల వ్యక్తులు ఆరు నెలలలోపు కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా ఎటువంటి క్లెయిమ్‌లు రాకపోతే, వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు.

డీఎస్పీ మహేష్ మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసింది

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త డీఎస్పీ మహేష్ మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌శాఖకు మహేష్ చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని వేడు కుంటున్నానని తెలిపారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాధవికి, ఆమె పిల్లలకు మనోధైర్యాన్ని కల్పించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

ప్రతీ రోజు వంద కిలోమీటర్లు

- బడి మీద మక్కువతో ప్రయాణిస్తున్న విద్యార్థిని



పానేటి పద్మ

మానకొండూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బడి మీద మక్కువతో రోజూ వంద కిలోమీటర్లు ప్రయాణిస్తోంది ఓ విద్యార్థిని. వివరాలు ఇలా ఉన్నాయి. మానకొండూర్‌లోని బాలుర ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పానేటి పద్మ గత సంవత్సరం వరకు మానకొండూర్‌లో ఉంటూ విద్య నభ్యసించింది. అయితే ఆమె తల్లి దండ్రులు వృత్తిరీత్యా సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటకు మకాం మార్చారు. మధ్యలో బడి మార్చలేని పరిస్థితి. అయితే ఇల్లంతకుంట నుంచి బస్సు సౌకర్యం లేదు. దీంతో తల్లి దండ్రులు ఆమెను వేములవాడలో ఉండే అమ్మమ్మ ఇంటిదగ్గర ఉంచారు. అక్కడి నుంచి ఆమె బస్సులో ప్రతిరోజు మానకొండూర్‌లోని బడికి వస్తోంది. ప్రతిరోజు రానుపోను వందకిలోమీటర్ల ప్రయాణం చేస్తూ పాఠశాలకు వస్తోందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. అంతదూరం ప్రయాణం చేసినా ప్రతి రోజు అందరి కంటే ముందే పాఠశాలకు వస్తుందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏడీ సమీక్ష

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బస్టాండ్ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ శుక్రవారం కరీంనగర్ జోన్ పరిధిలోని ఐదు రీజియన్ల ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అన్ని రీజియన్ల పనితీరు, వర్షాకాలం ప్రారంభం అయినందున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీజియన్ల నుంచి వివిధ పర్యాటక ప్రదేశాలకు నడుపుతున్న టూర్ ప్యాకేజీ సర్వీసులకు ప్రయాణీల నుంచి లభిస్తున్న ఆదరణ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు, పి మల్లేశం, డి వియభాను, పి మహేశ్, వివిధ రీజియన్ల ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏడీ సోలమన్

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటనలో ఒకరికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పు వెలువరించింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ శివారులోని బైపాస్‌రోడ్‌లోని ఒక ఫంక్షన్‌హాల్ వద్ద 2016లో రోడ్డు దాటుతతున్న దెబ్బట కృష్ణమోహన్‌ను మినీవ్యాన్ ఢీకొట్టగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడు మినీవ్యాన్ డ్రైవర్ సాధనవేని అలియాస్ తోట శంకరయ్యకు ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ ఆర్ పరమేశ్వర్‌ను సీఐ అభినందించారు.

యువకుడి హత్య ఘటనలో ముగ్గురిపై కేసు



కిషన్‌రావుపేటలో రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

వెల్గటూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటకు చెందిన సల్లూరి మల్లేష్ (26) అనేయువకుడి హత్యకేసులో శుక్రవారం ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మృతుడి తండ్రి సల్లూరి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నైనాల రాజిరెడ్డి(రాజన్న), నైనాల మల్లారెడ్డి (మల్లేష్), కొత్తపేటకు చెందిన చింతల హరీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన కథనం ప్రకారం కిషన్‌రావుపేటకు చెందిన నైనాల రాజిరెడ్డి కూతురు విషయంలో గొడవ జరుగగా గతంలో సల్లూరి మల్లేష్‌పై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో మృతుడిపై ఆగ్రహంతో యువతితండ్రి నైనాల రాజిరెడ్డి, అతడి తమ్ముడు నైనాల మల్లారెడ్డి, కొత్తపేటకుచెందిన అతడి స్నేహితుడు చింతల హరీష్‌లు పథకం ప్రకారం గురువారం కోటిలింగాల రోడ్డు వైపు పాతవైన్స్ వెనక ప్రదేశంలో కత్తితో పొడిచి హత్య చేశారు.

- భారీ బందోబస్తు మధ్య అంత్యక్రియలు

మల్లేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శుక్రవారం కిషన్‌రావుపేటకు తీసుకువచ్చారు. ఈక్రమంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను మోహరించారు. పోలీసులు మృతుడి కుటుంబీకులకు నచ్చజెప్పి న్యాయం జరిగేలా చూస్తామని ఒప్పించడంతో ఎలాంటి గొడవలు లేకుండా మల్లేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

- మిన్నంటిన రోదనలు

కిషన్‌రావుపేటకుచెందిన సల్లూరి రాజయ్యకు నలుగురు కుమార్తెలు కాగామల్లేష్ ఒక్కడే కొడుకు. తమకు ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, పాల్గొన్న విద్యార్థులు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులకు దాదాపు రూ.8,000కోట్లకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మేము అధికారంలోకి వస్తేమార్పు తీసుకువస్తాం, విద్యార్థులకు పెండింగ్ బకాయిలను విడుదల చేస్తామని చెప్పి ఇంతవరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల చదువు పూర్తై సర్టిఫికెట్లు కావాలని అడిగితే పూర్తి ఫీజుకడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు అంటున్నాయని ఆరోపించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అయితే బకాయిలు రాకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాలల నిర్వాహకులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. అలాగే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పర్యవేక్షించడానికి 16 మండలాల్లో ఒక్క మండలానికి కూడా ఎంఈవో లేని దుస్థితి నెలకొందన్నారు. రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని డిమాండ్‌చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో అసెంబ్లీనిముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆసంపల్లి వినయ్‌సాగర్, ఎల్కటూరి ఇసాక్, సహాయకార్యదర్శులు దుర్గం భోగేశ్వర్, గట్టు ఆకాశ్, సందేశ్, రాకేశ్, అక్షయ్, సన్ని, నాయకులు లక్ష్మణ్, చక్రి, మహేశ్, రఘు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్లాంట్‌లో యంత్ర సామగ్రి చోరీ

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్లాంట్‌లో ఎంజీఆర్‌లో ఉన్న విలువైన యంత్ర సామగ్రి చోరీకి గురైంది. చోరీ జరిగిందని ఎన్టీపీసీ ఏజీఎం విజయ్ కుమార్ సిక్దర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చురుగ్గా స్పందించారు. ఎస్ఐ ఉదయ్ కిరణ్ నేతృత్వంలో పోలీసులు కొద్ది గంటల్లోనే శుక్రవారం సామగ్రిని పట్టుకున్నారు.

మేడిపల్లి సెంటరులోని ఒక దుకాణంలో దాచిన సుమారు 2.80 లక్షల రూపాయల విలువైన క్రషర్ హ్యామర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నింది తులైన హర్యానాకు చెందిన వకీల్, మేడి పల్లి సెంటర్‌కు చెందిన అనిల్‌ను అదుపు లోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. అలాగే చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్, ఎక్స్‌కావేటర్‌ను సీజ్‌చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

తంగళ్లపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ప్రణయ్ తన ఇంటిముందు రాత్రి నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని దుండగలు ఎత్తుకెళ్లారు. అలాగే పద్మనగర్‌కు చెందిన గాజుల మహేశ్ ద్విచక్రవాహనం రాత్రి ఇంటి ముందు పార్కుచేయగా ఉదయం చూసే సరికి వాహనం కనిపించకుండా పోయింది. ఈ సంఘటనలపై ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రణయ్ ఇంటి ముం దు ఉన్న సీసీకెమెరాను పరిశీలించగా ముఖానికి మాస్కు ధరించిన ముగ్గురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై చేరుకుని ప్రణయ్‌ఇంటి ముందు వాహనం ఎత్తుకెళ్తున్న దృశ్యం రికార్డు అయ్యింది. పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఈ నెల 25న ఖని నుంచి బీదర్‌కు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, రేజింతల్, జర సంఘంకు సూపర్ లగ్జరీ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్టు ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగ భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. 25న గోదావరిఖని బస్టాండ్ నుంచి తెల్లవారు జామున 3.30గంటలకు బయలు దేరి 10గంటలకు బీదర్‌కు చేరుకుంటుంది. అక్క డ స్వయంభుగా వెలసిన లక్ష్మీనర్సింహ స్వామిని ఆలయ దర్శనం అనంతరం 2 గంటలకు బీదర్ బుర్జా చేరుకుంటుంది.



అనంతరం రేజింతల్‌లో సిద్ధి వినాయక స్వామి దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు జరా సంఘంలోని శ్రీ కేతికి సంగమేశ్వర స్వామిని దర్శించుకుని రాత్రి 12 గంటలకు తిరిగి గోదావరిఖనికి చేరు కుంటుందన్నారు. గోదావరిఖని నుంచి పెద్ద లకు రూ.1470, పెద్దపల్లి నుంచి రూ.1420, కరీంనగర్ నుంచి రూ.1370, పిల్లలకు గోదా వరిఖని నుంచి రూ.1130, పెద్దపల్లి నుంచి రూ.1070, కరీంనగర్ నుంచి రూ.1030 చార్జీలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీం నగర్ ప్రాంత ప్రజలు వినియోగించు కోవా లని కోరారు. వివరాల కోసం 701350 4982, 7989847927 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



బీపాస్ స్థానంలో బిల్డ్ నౌ

- ఏఐ టెక్నాలజీతో భవన నిర్మాణాలకు అనుమతి
- ఇకపై అనుమతి తర్వాతే ఇంటి నిర్మాణం
- ఆగస్టు నుంచి అమల్లోకి

చొప్పదండి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీజీబీపాస్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బిల్డ్ నౌ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. నాణ్యమైన, వేగవంతమైన పౌర సేవలను అందించడమే లక్ష్యంగా మున్సిపాలిటీలలో భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతి ప్రక్రియను ఇకపై బిల్డ్ నౌ ద్వారానే పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీపాస్, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి బిల్డ్ నౌ ద్వారానే అనుమతులు పొందాల్సి ఉంటుంది.

బీపాస్‌ను ఈ నెలాఖరుకు ముగిస్తున్నట్లు తెలి సింది. బిల్డ్ నౌ పూర్తిగా ఏఐ టెక్నాలజీ ఆధారిత వ్యవస్థతో పోర్టల్‌ను రూపొందిం చగా నిర్మాణ అనుమతి ప్రక్రియ వేగంగా పూర్తమవుతుంది. 75 గజాలలోపు నిర్మాణా నికి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసిన వెంటనే అనుమతి పొందవచ్చునని అధికారులు చెప్తున్నారు. ఆపై విస్తీర్ణం ఉన్న స్థలాలకు, లే అవుట్లకు 15 నుంచి 21 రోజులలోపు అనుమతి లభించనుంది.

ఏఐ టెక్నాలజీతో అనుమతి

నూతనంగా ప్రవేశెట్టిన బిల్డ్ నౌ పోర్టల్ ఏఐ టెక్నాలజీతో పనిచేస్తుంది. అనుమతి కోసం దరఖాస్తు చేసిన వెంటనే సంబంధిత అధికారికి స్థలం లొకేషన్ తెలిసిపోతుంది. స్థలంలో ఎలాంటి నిర్మాణాలు ఉన్నా యో సులువుగా తెలుస్తుంది. నిమిషాల్లోపలే స్థలం పరిశీలన పూర్తవుతుంది.

గతంలో డిజైన్లు, పత్రాలు, మ్యాప్‌ల పరిశీలనకు 20 నుంచి 30 రోజుల సమ యం పట్టేది. ఇప్పుడు సూచించిన విధానంలో పత్రా లను సమర్పిస్తే నిమిషాల్లోనే పరిశీలన పూర్తవు తుంది. అనుమతులు లేకుండా డిజైన్‌కు భిన్నంగా భవన నిర్మాణాలు చేప ట్టడం, వ్యాపార అవసరాల కోసం నిర్మించే భవనా లను నివాస గృహాలుగా చూప డం వంటి వాటికి బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. లే అవుట్ నిర్మాణ స్థలం హద్దుల అతిక్ర మణకు అవకాశం ఉండదు.

అనుమతి తీసుకున్న తర్వాతే పనులు

బిల్డ్ నౌ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న నిర్మాణదారులు అనుమతి తీసుకున్న తర్వాతే భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. బీపాస్ విధానంలో ఇంటి నిర్మాణం చేపట్టిన తర్వాత కూడా అనుమతి లభించేది. ప్రస్తుతం బిల్డ్ నౌలో మాత్రం అనుమతి తీసుకున్న తర్వాత ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడి ఇంటి స్థలంలో ఎలాంటి కట్టడాలు ఉన్నా సంబంధిత అధికారికి ఏఐ టెక్నా లజీ ద్వారా స్థల స్వభావం తెలిసి పోతుంది. దీంతో అధికారి భవన నిర్మాణ అనుమతి నిరాకరించే అవ కాశం ఉంటుంది. 2020లో తీసుకువచ్చిన టీఎస్ బీపాస్ ఈ నెల 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనుంది. టీఎస్ బీపాస్ స్థానంలో ఆగస్టు 1 నుంచి పూర్తిస్థాయిలో బిల్డ్ నౌను వినియోగంలోకి తీసుకురానున్నారు. వేగవంతమైన పౌర సేవలందించడమే లక్ష్యంగా చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఒకే రాష్ట్రం ఒకే విధానం పేరిట బిల్డ్ నౌకు శ్రీకారం చుట్టింది.



డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం మే/జూన్-2025లో నిర్వహించిన డిగ్రీ-2,4,6వ(సీబీసీఎస్)సెమిస్టర్స్ రెగ్యు లర్, బ్యాక్‌లాగ్ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్) సంబంధించిన పరీక్ష ఫలితాలను ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ శుక్రవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు తమ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in మరియు https://stvuresults. a{ure-websites.netలో చూసుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ అబ్రరుల్ బాకి, అసిస్టెంట్ రిజిస్టర్ వై. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించిన శాతవాహన వైస్ చాన్స్‌లర్

రామగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ శుక్రవారం మంథని జేఎన్‌టీయూ ఇంజినీ రింగ్ కళాశాలను సందర్శించారు. శాతవాహన యూనివర్శిటీకి అను బంధం గా హుస్నాబాద్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ కళాశాల ఆరంభం అవుతున్న నేపథ్యంలో మంథని ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న వసతులను పరిశీలించారు. కళాశాలలోని అకాడమీ బ్లాక్‌తో పాటు ల్యాబ్ లు, లైబ్రరీ, తరగతి గదులను, హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం కళా శాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌తో సమావేశమై సిలబస్, అడ్మిషన్ల ప్రక్రియపై చర్చించారు. రిజిస్ట్రార్ రవికుమార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ సురేష్, ప్రొఫెసర్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉన్నారు.

కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను వెంటనే ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకుండా లక్షలాది మంది రైతుల ఉసురు పోసుకోవడం ఎంత వరకు సమంజస మన్నారు. దీనిపై సర్కారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలు, చెరువులు వెలవెలబోతున్నాయ న్నారు. ఈ ప్రాజెక్టుల నుంచి త్వరలోనే మంచి నీరు సరఫరా చేయలేని దుస్థితి ఏర్పడే ప్రమా దం ఉందన్నారు. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద 82 వేల పైచిలుకు క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించి సముద్రం పాలవుతుందన్నారు. మేడిగడ్డ బరాజ్‌తో ఎటువంటి సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తు తం ఉన్న పరిస్థితుల్లో మేడిగడ్డ బరాజ్‌తో సం బంధం లేకుండానే కన్నెపల్లి పంపుహౌస్ నుంచి రోజుకు 20 వేలపై చిలుకు క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసు కునే అవకాశం ఉందన్నారు.

కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు ఎత్తిపోయడానికి నేషనల్ డ్యాం సెఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఎక్కడ అభ్యంతరం తెలుపలేదని గుర్తుచేశారు. ఎస్సా రెస్పీ పునర్జీవం ద్వారా వరదకాలువను నిండు గా నింపుకోవడంతో పాటుగా ఈ పరిధిలోని అన్ని చెరువులను నింపడానికి పుష్కలమైన అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పదే పదే చెపుతున్న రేవంత్ సర్కా రు మాత్రం కక్ష పూరితంగానే వ్యవహరిస్తోం దన్నారు. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుం దన్న అక్కసుతోనే కాంగెస్ ప్రభుత్వం నీటిని ఎత్తి పోయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి ని ఎత్తిపోసే విషయంలో కాంగ్రెస్ సర్కారు ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, భారీ నీటి పారు దల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చూపుతు న్న వివక్ష, నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతుల జీవితాలు ఆగమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ప్రస్తుతం నార్లు ముదిరి పోతున్నాయని, ఈ సమయంలో నాట్లు వేసుకోవడానికి ఒక్కసారి సాగునీరు అందిస్తే రైతులకు అండగా నిలిచి నట్లు అవుతుందన్నారు. మేడిగడ్డ బరాజ్‌ను యాజమాన్యమే రిపేర్ చేసుకోవాలని ఎన్‌డీ ఎస్ఏ ఇప్పటికే స్పష్టంగా చెప్పిందన్నారు. ఇప్ప టికైనా కక్షలు మానుకొని రైతు సంక్షేమం కోసం కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తి పోసి నార్లు వేసుకోవడానికి ప్రభుత్వం సహక రించాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సిరి సిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, గ్రం థాలయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీం దర్‌రెడ్డి, పొన్నం అనిల్, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ రమణారావు, రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి సారె..



పట్టువస్త్రాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

వేములవాడ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారికి శ్రీవల్లి సేవా సంస్థకు చెందిన సుమారు 200 మంది సభ్యులు శుక్రవారం కన్నుల పండువగా సారె సమ ర్పించారు. తిప్పాపూర్ బస్టాండు నుంచి అమ్మవారికి పట్టు వస్త్రా లు, పసుపు, కుకుమ, పూలు, పండ్లు, స్వీట్లతో ఊరేగింపుగా రాజన్న ఆలయానికి తరలి వచ్చారు. ముందుగా శ్రీలక్ష్మీ గణపతికి రాజరాజే శ్వర స్వామి వారికి పూజ లు నిర్వహించి పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం రాజరాజేశ్వరి అమ్మ వారికి పట్టు వస్త్రా లు, పసుపు, కుంకు మ, పూలు, పండ్లు, స్వీట్లను అంద జేశారు. పాడి పం టలు, పిల్లపాపలు చల్లం గా ఉండేలా దీవించాలని అమ్మ వారిని వేడుకు న్నట్లు సంస్థ ఫౌండర్ మల్లెబోయిన పుష్పలత తెలిపారు.



అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు, పూలు, పండ్లు

క్రీడల జిల్లాగా ఖ్యాతి సాధించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్



హరీష్‌ను సన్మానిస్తున్న డీవైఎస్‌వో, క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడల జిల్లాగా ఖ్యాతిని సాధించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ అన్నారు. జిల్లాలోని కోనరావుపేట మండలం నాగారం నకు చెందిన బుర్రవేణి హరీష్ నేషనల్ ఇన్స్టూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో ఆర్చరీ విభాగంలో సీటు సాధించగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో హరీష్‌ను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల అకాడమీ కోచ్ గుర్రం సంపత్‌గౌడ్, ఎం జగన్మోహన్, కబడ్డీ కోచ్ ప్రశాంత్, వాలీబాల్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

డీపీవో కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నమోదు లేని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లిం చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు శుక్రవారం కరీంనగర్‌లో డీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎలుకపెల్లి సారయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వడ్లూరి లక్ష్మినారాయణ, కార్మికులు పర్లపల్లి రమేష్, కండె మధునయ్య, లక్ష్మి, సరోజన, అవినాష్, నితిన్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా జూడో సెంటర్ పరిశీలన



క్రీడా పాఠశాల ఖేలో ఇండియా జూడో సెంటర్ విద్యార్థులతో సాయ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలోని ఖేలో ఇండియా జూడో సెంటర్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ జిమ్నాస్టిక్ కోచ్ చంద్రశేఖర్‌రావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియాలోని వివిధ విభాగాలను పరిశీలించారు. విద్యార్థుల గురించి, వారి ఖర్చుల గూర్చి, కోచ్ జీతభత్యాల గురించి అడిగి తెలుసు కుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేసిన వారు ఖేలో ఇండియా జూడో సెంటర్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్, ఖేలో ఇండియా కోచ్ కే శ్యామ్, ప్రాంతీయ క్రీడాపాఠశాల కోచ్‌లు ఇంది ర, విక్రమ్, సాయి, కిష్టయ్య, పవన్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కిని నరసింహులు



సమావేశంలో మాట్లాడుతున్న బక్కని నరసింహులు

కరీంనగర్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, జాతీ య అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు, కరీంనగర్ పార్లమెంట్ పరిశీలకులు నన్నూరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరం లోని పార్టీ కార్యాలయంలో కరీంనగర్ పార్ల మెంట్ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమా వేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెం డింగ్‌లో ఉన్న కమిటీలు పూర్తిచేసి గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభ వం తీసుకు రావా లని అన్నారు. గ్రా మాల్లో టీడీపీకి మంచి ఆదరణ ఉందన్నారు. పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థులు వ్యక్తి గత ఓటు బ్యాంకు కలిగి ఉంటే ఎన్నిక ల్లో గెలిచే అవకాశా లు ఎక్కువగా ఉం టాయన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్య కర్తలు సమన్వయంతో కలిసి పనిచేయాలని, పార్టీ శ్రేణులు ఎన్నికల్లో కసితో పనిచేసి టీడీపీ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గొల్లపల్లి ఆనంద్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్ గౌడ్, పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు కళ్యాడపు ఆగయ్య, దామెర సత్యం, ఆవునూరు దయాకర్‌రావు, బత్తుల శ్రీనివాస్, మచ్చ ఆంజ నేయులు, నాగుల బాలాగౌడ్, తీగుట్ల రమేష్ కుమార్, రొడ్డ శ్రీనివాస్, రొడ్డ శ్రీధర్, లంక భాస్కరశర్మ, తాటికొండ శంకర్, ఆకుల కాం తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య భవనాల కూల్చివేతలు





వేములవాడలో భవనాల కూల్చివేత వద్ద మోహరించిన పోలీసులు

వేములవాడ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండు నుంచి రాజన్న ఆలయం వరకు చేపడు తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భవనాల కూల్చివేతలు కొన సాగు తున్నాయి. మొత్తం 243 భవనాలు తొలగించేందుకు నిర్వాసితులను గుర్తించారు. అయితే 88 మంది హై కోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చారు. మిగతా ఇళ్లను గతనెల 16వ తేదీన పోలీసు బందోబస్తు మధ్య తొలగిం చారు. 88 మందికి కోర్టు స్టే ముగియడంతో శుక్రవారం ఆయా భవనాల కూల్చివేత ప్రారంభించారు. మరో 6 మంది నిర్వాసితుల స్టే గడువు సైతం ఈనెల 23వ వరకు ఉందని స్థానిక నిర్వాసితులు తెలిపారు. రాజన్న ఆలయం ముందు శుక్రవారం భారీగా పోలీసులు, అధికారులు చేరుకున్నారు.

కూల్చివేతలను పరిశీలించిన కలెక్టర్..

వేములవాడ పట్టణంలోని చేపడుతున్న కూల్చివేతలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం పరిశీలించారు. రాజన్న ఆలయం ముందు భాగంలో పనులు కొనసాగు తుండగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారు లకు పలు సూచనలు చేశారు. వెంట ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ ఉన్నారు.

దివ్యాంగులకు రాయితీ రుణాలు



దరఖాస్తుకు ఈనెల 31 వరకు గడువు

కరీంనగర్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఇతరుల మాదిరిగానే దివ్యాంగులు సాధారణ జీవనం గడప డమే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, వ్యాపారం వంటివి చేసుకునేలా దివ్యాం గుల ఉపాధి, ఉనరావాస పథకం అమల్లోకి తీసుకు వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్ప టికే దరఖాస్తుల స్వీరణ ఆన్‌లైన్ విధానంలో ప్రారం భించారు. లబ్ధిదారులు ఈ నెల 31 తేదీ వరకు దర ఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నది. tgomms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువపత్రా లతో దరఖాస్తు చేసుకోవచ్చు. కరీంనగర్ రూరల్ మండలంలో ఇప్పటికే ఇరుకుల్ల గ్రామానికి చెందిన దివ్యాంగునికి 50వేల రుణం బ్యాంక్ లింకేజీ ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ధ్రువపతారలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసు కున్న వారి వివరాలు గ్రామీణ ప్రాంతం వారికి ఎంపీడీవో, పట్టణవాసులకు మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లోకి వెళ్తాయి. వాటిని మండల స్థాయిలో ఎంపీడీవో, సీడీపీఓ, ఏపీఎంతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారు. ఇందులో మహిళలకు 33 శాతం అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులు ఎవరంటే..

కనీస దివ్యాంగత్వం 40శాతం పైన ఉండాలి. సదరం సర్టిఫికెట్ కలిగి ఉండాలి. వయస్సు 21-55 సంవత్సరాలలోపు ఉండాలి. ఆదాయ పరిమితి 1లక్ష 50వేలు (గ్రామీణ ప్రాంతాల వారికి) ఉండాలి. అయిదేళ్లలో దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఇతర శాఖ, ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి రాయితీ పొంది ఉండకూడదు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీసీలను, హిందూవులను అనాది కాలం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతున్నామని చెప్తూనే బీసీ-ఈ కేటగిరిలో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం సరికాదన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు పక్కకు పెట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను కల్పిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకలు పెంట శ్రీనివాస్, శానకొండ వాసు, మంతెన కిరణ్, మాదాసు సంజీవ్, నారోజు రాకేష్ చారి, మంద వెంకన్న, గుడిసెల రమేష్ గౌడ్, అజయ్, గుంపట మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోరింటాకు సంబరాలు

వేములవాడ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గోరింటాకు సంబరాలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. కళాశాలలో ఆషాఢం మాసం సందర్భంగా మహిళా సాధికారత విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థినులు గోరింటాకును సేకరించి ఒకరి చేతిక ఒకరు అలంకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలకు ప్రాధాన్యం..

కోనరావుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో నాలుగు లక్షలతో మహిళా సంఘ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘ భవనానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రూ. 4 లక్షలు మంజూరు చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మహిళలను లక్షాధికారులను చేయాలని సంకల్పంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీపి కార్యదర్శి అభిలాష్, మాజీ సర్పంచ్ కచ్చకాయల బాల్‌రెడ్డి, డి.దేవయ్య, బుర్ర జ్యోతి, రమేష్, నీరటి అరుణ, సంజీవ్, ఉప్పుల గంగయ్య, రంగాల శ్రీనివాస్, బొడ్డు రమేష్, సుంకరి మహేష్, ఎరవెల్లి రాజయ్య, మాసం జనార్ధన్, నీరటి రవి, లింగయ్య, దండు శ్రీనివాస్, అంజయ్య, సత్తయ్య, సుధాకర్, ప్రభాకర్, కరుణాకర్, మహిళా సంఘం నాయకురాలు వజ్రమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనం అదనపు పనులకు భూమిపూజ

తంగళ్లపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ భవనం అదనపు పనులకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పొన్నాల పర్శరాములు, ఆరెపెల్లి బాలు, మాజీ ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి, నాయకులు సత్తు శ్రీనివాస్‌రెడ్డి, లింగాల భూపతి, చుక్క శేఖర్, గుగ్గిళ్ల శ్రీకాంత్, కొత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యం..



గణేశ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యమని హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది(ఎలక్ట్రిసిటీ విభాగం) పి. గణేశ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్‌లను సందర్శించిన సందర్భంగా ఆయనను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్‌కార్డులు, వెల్ఫేర్ ఫండ్ న్యాయవాదులందరికి వర్తించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు వెంకటి, గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కట్కం జనార్ధన్, ఏజీపీలు కళ్యాన్‌చక్రవర్తి, వేణుగోపాల్, బొడ్డు ప్రశాంత్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాదులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోనరావుపేట వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. కోనరావుపేట మండలం కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఇంటింటా ఫీవర్ సర్వేను నిర్వహించి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇంటి ఆవరణలో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. జ్వరం వచ్చిన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించుకోవాలని అన్ని పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రషీద్, సువర్ణ, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన్, జీపి కార్యదర్శి సాయికృష్ణ, ఏఎన్ఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నేతాజీ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించనున్న క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌ను నిరుద్యోగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం చైర్మన్ జూపల్లి పృథ్వీదర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో గ్యాట్నిక్స్, ఐడెఎక్స్, లలాటాక్ష కంపెనీల ద్వారా 2022-25 విద్యా సంవత్సరంలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగ అవకాశలను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. వివరాలకు 9441130188, 7013142129 సెల్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బండలింగంపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, బాబు, గిరిధర్‌రెడ్డి, రాములు, రఫీక్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లాగౌడ్, బుచ్చిరెడ్డి, బాలుయాదవ్, హైమద్, రాంరెడ్డి, సత్యంరెడ్డి, కొండయ్య, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్త తొలగింది..

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తచెదారం తొలగింది. కాలనీలో చెత్తాచెదారం వల్ల కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 18న 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన 'రోడ్డు పక్కనే చెత్త' కథనానికి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం స్పందించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి రహదారి పక్కన ఉన్న చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వీర్నపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శివకుమార్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్‌చైర్మన్ లక్మణ్, సెస్ డైరెక్టర్ మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీటి యాదవ్, గర్జనపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు రాకేష్ గౌడ్, సీనియర్ నాయకులు కాంతయ్య, హరిలాల్, సంతోష్‌నాయక్, నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు..

తంగళ్లపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఎస్ఐ ఉపేంద్రచారి ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. శుక్రవారం మానేరు నుంచి ఇసుకకు అనుమతివ్వడంతో ట్రాక్టర్ల స్పీడ్‌ను కంట్రోల్ చేయడంతో పాటు డ్రైవర్లకు టెస్టులు చేశారు.

వాహనాలు తనిఖీ చేసిన ఎంవీఐ

తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఎంవీఐ వంశీ అధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు కోరుట్లపేట గ్రామాల్లో చైతన్య, భాగ్యశ్రీ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, డీఆర్డీవో శేషాద్రి, డీపీవో అఫ్జల్‌బేగం, మహిళలతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోనే రాజన్నసిరిసిల్ల జిల్లాకు 23దుకాణాలను మంజూరు చేయడం ప్రథమమని అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలో మహిళా సంఘాలకు క్యాంటిన్లు, కోళ్లు, పాడి గేదెలు, ఆవుల పెంపకం, ఆర్టీసీ బస్సులతో పాటు స్వయం ఉపాధి రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. భవిష్యత్తులో పారిశ్రామికరంగంలోనూ రాణించేలా రైస్‌మిల్లులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. మూడు దుకాణాలను ప్రారంభించామని త్వరలో జిల్లాలోని పలు గ్రామాల్లో 20 దుకాణాలను ప్రారంభించి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎంలు శ్రీనివాస్, రవీందర్, మాణిక్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీడీవో సత్తయ్య, వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఎంపీవో రాజు, సెర్ప్ ఏపీఎం మల్లేశం, నాయకులు నర్సయ్య, లక్మారెడ్డి, బాబు, గిరిధర్‌రెడ్డి, గౌస్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, రామచంద్రం, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

ఏ దిక్కు లేని అనాథలం.. ఆదుకోరూ...

- కలెక్టర్‌తో గోడు వెళ్లబోసుకున్న వృద్ధ దంపతులు

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఉన్న ఊరిలో ఉపాధి లేక ఒక్కాగానొక్క కొడుకును గల్ఫ్ దేశం పంపిస్తే రెండేళ్ల కిందట అక్కడే జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని, తమకు ఏ దిక్కు లేకుండాపోయిందని.. తమను ఆదుకోవాలంటూ వృద్ధ దంపతులు మోకినపల్లి నర్సవ్వ-నర్సయ్యలు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను వేడుకున్నారు. స్పందించిన కలెక్టర్ ఆదుకుంటానని భరోసా కల్పించారు. రూ.5 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రూ.2 లక్షలు అందించేందుకు వృద్ధ దంపతులను శనివారం కలెక్టరేట్‌కు తీసుకురావాలని అక్కడే ఉన్న డీఆర్డీవో శేషాద్రిని ఆదేశించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ఎస్పీ మహేష్ బి. గీతే



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ

చందుర్తి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు. చందుర్తి మండలం కిష్టంపెట గ్రామంలో ఏర్పాటు చేసిన 9సీసీ కెమెరాలను, పోలీస్ అధికారులు, మాజీ ప్రజాప్రదినిధులతో కలిసి ఎస్పీ మహేష్ బీ.గితే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి గ్రామస్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్వీయారక్షణ కోసం మండలంలో మిగిలిన గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారా నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. గ్రామాల్లో అనుమానంగా సంచరించే వ్యక్తుల సామాచారం, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల సమాచారం పోలీస్ వారికి అందించాలన్నారు. ప్రజలు యువకులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలు పాటించాలన్నారు.

గోవిందరాజుల స్వామి దర్శించుకున్న ఎస్పీ

చందుర్తి మండలం సనుగుల గ్రామ శివారులను గుట్టపైగల శ్రీ గోవిందరాజుల స్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంట సీఐ వెంకటేశ్వర్లు,ఎస్.ఐ రమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సమర్థవంతమైన సేవలదించాలి

పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవాలందించాలని ఎస్పీ మహేష్ బీ. గీతే అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా చందుర్తి పోలీస్ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు ప్రారంభించి వారితో కలిసి షటిల్ ఆడారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రమేష్, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ నిర్మాణంలో వివాదం



విగ్రహ నిర్మాణ స్థలంలో బైఠాయించిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

గంబీరావుపేట, జులై 18 (ఆంధ్రజ్యోతి) : గంబీరావుపేటలో ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విగ్రహ నిర్మాణంలో శుక్రవారం వివాదం తలెత్తింది. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం కోసం నిర్మించిన పిల్లర్‌ను కూల్చివేయడం వివాదానికి తెరలేపింది. ఈనెల 11న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ నిర్మాణం కోసం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఇరిగేషన్ స్థలంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో శుక్రవారం ఇరిగేషన్ డీఈ నార్సింగ్ అక్కడికి చేరుకుని నిర్మాణ పనులు ఆపేశారు. విషయం తెలుసుకున్న విశ్వబ్రాహణ సంఘం నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఓవైపు ఫిర్యాదుదారులు, మరోవైపు విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు నిర్మాణం స్థలంకు చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. విగ్రహ నిర్మాణనికి సంబంధించిన పిల్లర్‌ను తొలగించే క్రమంలో ఎక్స్‌కవేటర్‌ను అధికారులు తెప్పించడంతో ఆ ప్రాంతం మరింత ఉద్రిక్తతగా మారింది. తెలంగాణ సిద్ధాంతకర్త విగ్రహ నిర్మాణాన్ని ఎలా అడ్డుకుంటారని, పిల్లర్‌ను ఎలా తొలగిస్తారని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎక్స్‌కవేటర్ ముందు బైఠాయించారు. దీంతో ఎస్ఐ రమాకాంత్ సిబ్బందితో వచ్చి వారిని సముదాయించారు. అనుమతి ఉంటే నిర్మించుకోవాలని లేకుంటే వివాదం చేయొద్దని పోలీస్‌లు సూచించడంతో అక్కడి నుంచి తహసీల్దార్ ఆఫీస్ వద్ద బైఠాయించారు. అధికారులు స్పందించకపోవడంతో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద రోడ్డుపై ఆందోళనకు దిగారు. నడిరోడ్డుపై బైఠాయించడంతో వాహన రాకపోకలు స్తంభించిపోయా యి. దీంతో మళ్లీ ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళ నను విరమింపచేశారు. విశ్వబ్రాహణ సంఘం నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఇరిగేషన్ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ అధికారులు తమపై దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొ న్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులకు బీజేపీ నేతలు మద్ద తు తెలిపారు.

డబ్బులు డిమాండ్ చేసిన వారి పేర్లు బయట పెడుతా..

ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విగ్రహ నిర్మాణం కోసం కొందరు తనను డబ్బులు డిమాండ్ చేశారని, వారిపేర్లు బయటపెడుతానని విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు వేణు తెలిపారు. విగ్రహ నిర్మాణం సజావుగా జరగాలంటే తమకు డబ్బులు డిమాండ్ చేశారని వెల్లడించారు. తెలంగాణ సిద్ధాంతకర్త విగ్రహ నిర్మాణం కోసం డబ్బులు డిమాండ్ చేయడం చాలా బాధగా ఉందన్నారు.

కుల సంఘాల భవనాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రెడ్డబోయిన గోపి

గంబీరావుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గంబీరావుపేట మండల కేంద్రంతో పాటు నర్మాల, సముద్రలింగాపూర్ గ్రామాల్లో శుక్రవారం కుల సంఘాల భవనాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో మున్నూరు కాపు సంఘ భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. నర్మాల గ్రామంలో ఎంపీ నిధులైన రూ. 5 లక్షలతో రజక సంఘం భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా సముద్రలింగాపూర్ గ్రామంలో ఎంపీ నిధుల నుంచి మంజూరైన రూ 5 లక్షలతో చేపట్టనున్న ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కుల సంఘాల నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల బీజేపీ అధ్యక్షుడు కోడె రమేష్, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి దేవేందర్‌యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దెవసాని కృష్ణ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వాజిద్ హుస్సెన్, ప్రధాన కార్యదర్శులు విగ్నేష్‌గౌడ్, మల్లేశం, నాయకులు స్వామిరాజు, నాగరాజు, ఎలెందర్, సత్యనారాయణ, రాజిరెడ్డి, దేవరాజు,నరేష్, దేవగౌడ్, నర్సింలు, రాజేష్, రమేష్ తదితర నాయకులతో పాటు మున్నూరు కాపు, ముదిరాజ్, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

మరో సంఘాన్ని ఏర్పాటు చేయాలి

- సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో మరో పద్మశాలి సంఘం ఏర్పాటు కావాల్సిన సమయం వచ్చిందని పట్టణ పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సంఘం నాయకులు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికల విధానం సభ్యుల మనోభావాలను దెబ్బ తీశాయని ఆరోపించారు. సంఘంలోని కొందరు పెద్ద మనుషులు(శ్రీమంతులు)వారి స్వార్థం కోసం సంఘంలోని సామాన్య సభ్యులు ఎన్నికల్లో పోటీ చేయకూడదన్న దురుద్దేశంతో తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సంఘం ఎన్నికల నామినేషన్ల ఫీజును పెంచడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఎన్నికల నామినేషన్ల ఫీజును తగ్గించాలని పాత పద్దతిలోనే నిర్వహించాలని కొత్త విధానాలను మార్చుకోవాలని తాము సూచించినా పెడచెవిన పెట్టి వారికి నచ్చిన విధంగా ఎన్నికలను నిర్వహించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పెద్ద మనుషుల అహంకార ధోరణిపై పద్మశాలి సంఘం సభ్యులు ఆలోచించాలని కోరారు. పెద్ద మనుషుల ఆలోచన సంఘం ఎన్నికల బైలాకు విరుధంగా ఉందని, వీరి వల్ల కుల ఔన్నత్యాన్ని దెబ్బతీస్తుందని ఆరోపించారు. పట్టణంలో మన ఔన్నత్యాన్ని గొప్పతనాన్ని ఐకమత్యాన్ని చాటే విధంగా మరో పద్మశాలి సంఘం నిర్మితం కావాల్సిన అవసరం ఉందని తాము భావిస్తున్నామన్నారు. కొత్త సంఘం నిర్మాణం దిశగా పద్మశాలి సంఘం అడహక్ కమిటీ వేస్తున్నామని, ఇందుకు సభ్యులు సహకరించాలని కోరారు.

అనంతరం సంఘం అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం ఆడహక్ కమిటీ కన్వీనర్ కుసుమ విష్ణుప్రసాద్, కోకన్వీనర్ రిక్కమల్లె మనోజ్‌కుమార్, సభ్యులు చిమ్మని ప్రకాష్, కొండ ప్రతాప్, గుడ్ల విష్ణు, గుజ్జె శివరాం, ఏలూర చంద్రకాంత్, గాజర్ల సమ్మయ్య, రాపెల్లి రమేష్, తడుక భాను, వెంగళ రవి, వెంగళ వెంకటేశం, సంగీతం సత్యసాయిరాంను ఎన్నుకొన్నారు.

వెజిట్రబుల్స్..



సిరిసిల్లలోని కూరగాయల మార్కెట్

(5వ పేజీ తరువాయి)

చేసి అమ్ముకునే వ్యాపారులు ధరలు ఎక్కువగా ఉండడంతో కొనుగోలు జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలతో కూరగాయల అమ్మకాలను కూడా తగ్గించుకోవాల్సి వస్తోందని పలువురు వ్యాపారులు తెలిపారు.

అదనపు భారం..

జిల్లాలో కూరగాయల ధరల పెరుగుదలతో సామాన్య కుటుంబాలకు ఆదనపు భారంగా మారింది. ఒక కుటుంబానికి అదనంగా వెయ్యి రూపాయలపైనే భారం పడుతోంది. 20 రోజుల క్రితం వరకు టమాటా కిలో రూ 15 రూ 20 వరకు ఉండగా ప్రస్తుతం రూ 40 చేరింది. బెండకాయలు కిలో 60, దొండకాయలు కిలో రూ 60, చిక్కుడు రూ 80, కాకర రూ 60, వంకాయలు రూ 80, పాలకూర రూ 60 చేరుకుంది. క్యాబేజీ కిలో రూ 40, కాలిఫ్లవర్ రూ 80, క్యారెట్ రూ 80, అలుసంద రూ 40, మునక్కాయలు రూ 100, బీరకాయలు రూ 80, గోరుచిక్కుడు రూ 80, బీట్‌రూట్ రూ 70, ఆకుకూరలు కిలో రూ 100 నుంచి 120 వరకు ధరలు చేరుకున్నాయి. ఇలాగే ఇతర కూరగాయల ధరలు రెండింతల నుంచి మూడింతలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో మాజీ సర్పంచ్‌ల చేరిక

ఇల్లంతకుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి) మండలంలోని రెండు గ్రామాల మాజీ సర్పంచ్‌లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. నియోజకవర్గకేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సిరికొండ మాజీ సర్పంచ్ నీలం అంజయ్య, తెనుగువానిపల్లె మాజీ సర్పంచ్ వంచ అనసూయచంద్రారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గొడుగు బాలయ్య తదితరులకు కాంగ్రెస్‌పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్యయాదవ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు వరుకోలు మల్లయ్య, బొల్లవేణి రమేష్, ఆకుల సత్యం, మల్లారెడ్డి, సలీం, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బద్దిపోచమ్మ బోనాలు



బోనాలతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న లెవన్ యూత్ సభ్యులు

వేములవాడ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీబద్ది పోచమ్మ వారికి శుక్రవారం భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన లెవన్‌టైగర్స్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలను తీశారు. అలాగే స్కై స్కూల్ ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను నిర్వహించారు. స్కూల్ ఇంచార్జ్ జక్కుల మహేష్,ప్రిన్సిపాల్ జమున, ఉపాధ్యాయులు మమత, స్రవంతి, హేమకళ, చంద్రకళ, అంజలి, అర్చన తదితరులు ఉన్నారు.

శాకాంబరి అవతారంలో అమ్మవారు..

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని గీతా మందిరంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలోని అర్చకులు రవీందర్‌శర్మ, నిఖిల్‌శర్మలు అమ్మవారికి పూజలు జరిపించారు. రకరకాల కూరగాయలతో దేవీని శాకాంబరి రూపంలో అలంకరించారు. గీతా మందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ బోనాల పండుగ



పూజలు చేస్తున్న మహిళలు

తంగళ్లపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండేపల్లిలో సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తెలంగాణ బోనాల పండుగను నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా బోనాల పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కొక్కుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పూర్ణిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో బోనాల ఉత్సవాలు

గంబీరావుపేట, జులై 18 (ఆంధ్రజ్యోతి): గంబీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, అధ్యాపకులు దర్మపురి, అంజనేయులు, వాణి, ఆది విష్ణు, శ్రావణ్‌కుమార్, బిక్షమయ్య, కృష్ణప్రసాద్, శ్రీనివాస్, సుచరణ్, జగన్నాథం, శైలజ, దీపిక, సత్యానందం, శంకరయ్య, నదీప్, లక్ష్మి, జ్యోతి తదితరులు ఉన్నారు.

బండి సంజయ్‌కుమార్‌ను కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రితో బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ నాయకులు కలిశారు. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం సంజయ్‌కుమార్‌ను కలువగా ప్రధానమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, మండల ఇంచార్జ్ అడిచర్ల రాజు, బూత్ అధ్యక్షుడు మారవేని రాజు, మాజీ సర్పంచ్ చెప్యాల గంగాధర్, జాప శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం రమేష్, మారవేని చంద్రశేఖర్, గజ్జల రాజమల్లు, నరిగె మల్లేశం, కట్కూరి అరుణ్, మారవేని రాజు, కావటి దయాకర్, మ్యాకల మల్లేశం, బర్ల శ్రీనివాస్, కొండికొప్పుల రవి, గాలి పద్మ, కొండికొప్పుల మధురమ్మ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వీర్నపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దిమల్ల తండాలో సైబర్ నేరాలపై శాంతిభద్రతలపై గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటుచేశారు. ఎస్ఐ వేముల లక్ష్మణ్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే డయల్ 100ను సంప్రదించాలన్నారు.